తల్లి పాలే శిశువుకు శ్రీ రామ రక్ష

పెద్దపల్లి, జూలై 31: శిశువుకు తల్లి పాలే శ్రీరామ రక్ష అని, తల్లి పాల ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష జరిపారు. ఈనె ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను జిల్లా సంక్షేమ శాఖ అధికారి వివరించారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు

ఏఐటీయూసీ నాయకుల ముందస్తు అరెస్టు

సుల్తానాబాద్, జూలై 31, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం దృష్టికి కార్మికుల సమస్యల పరిష్కారం కోసి వినిపించడానికి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఏఐటీయూసీ నాయకులు కడారి సునీల్, లావణ్య, సుంకె శ్రీకాంత్, మధ్యాహ్న భోజన నాయకులను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన నాయకులను సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పోలీస్ స్టేషన్‌లో కలిసి సంఘీభావం తెలిపారు.

పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

కమాన్‌పూర్, జూలై 31: తమ హక్కుల సాధన కోసం హైదరాబాద్ అసెంబ్లీకి తరలివెళ్తారని మండలంలోని ఆటో డ్రైవర్లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్ట నర్సయ్య, నాయకులు కాస రవి, సంపత్, మేడ తిరుపతి, సుంచు శ్రీను, పటాన్, అజ్జల్, ప్రతాప్, రమేశ్, అమీర్‌ఖాన్, ఖాజా, శ్రీనివాస్, సాగర్, ఆడెపు శేఖర్, సారయ్య, సదానందం, బోగ రమేశ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌లోనే నిర్బంధించారు.

ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూలై31: మాజీ ఎంపీపీ బండారి స్రవంతి భర్త బండారి శ్రీనివాస్‌గౌడ్ తండ్రి చంద్రయ్య ఇటీవల మృతి చెందాడు. బుదవారం గౌరెడ్డిపేటలో దశదినకర్మ నిర్వహించగా మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్టమధుకర్ చంద్రయ్య చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు. వారి వెంట అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, నాయకులు సలేంద్ర కొమురయ్య యాదవ్, సలేంద్ర రాములు యాదవ్, మారం తిరుపతి యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జీ రఘువీర్ సింగ్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి, జూలై 31: కల్వచర్ల గ్రామంలో దండు లక్ష్మీ, కట్ట సాహితి ఇటీవల మృతి చెందగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ, శెంకేసి రవీందర్, సత్యనారాయణ, పోశం మెట్టు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 493 మంది హాజరు

పెద్దపల్లి కమాన్, జూలై 31 : ఉపాధ్యాయ నియామకాల కోసం జిల్లాలో నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 పరీక్షకు బుధవారం 493 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో డీ మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 550 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 493 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

జీడీకే 2 ఇంక్లైన్‌కు చేరిన సీపీఎం బస్సుయాత్ర

గోదావరిఖని, జూలై 31: తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చేపట్టిన బస్సుయాత్ర బుధవారం జీడీకే 2 ఇంక్లైన్ గని, ఏరియా వర్క్‌షాప్‌నకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, భూపాల్ మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. ముందుగా బస్సుయాత్ర బృందానికి మున్సిపల్ చౌరస్తాలో సీపీఎం శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బైక్‌ర్యాలీగా గనుల వద్దకు చేరారు. అనంతరం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇక్కడ సీపీఎం ఆశయ రాష్ట్ర కమిటీ సభ్యులు పీ రాజారావు, మంద నరసింహారావు, జిల్లా కార్యదర్శి వై యాకయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు ముత్యంరావు, మహేశ్వరి, కుమారస్వామి, రామాచారి, మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేశ్, ఎస్‌కే గౌస్, దాసరి సురేశ్, సానం రవి, వంగల రాములు, శ్రీనివాసరావు, శంకరన్న, సమ్యయ్య, శివరాంరెడ్డి, నంది నారాయణ, గోశం సాయికృష్ణ, సాగర్, శశికిరణ్, సాగర్, జనార్దన్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శోభాశంకర్

సుల్తానాబాద్, జూలై 31 : సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎం శోభశంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నియమాకాల్లో హైదరాబాద్ మెప్మా గ్రేడ్ -1 అధికారిగా పనిచేస్తున్న శోభా శంకర్‌ను సుల్తానాబాద్‌కు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ కట్ల వేణుమాధవ్ కరీంనగర్‌కు బదిలీ అయినట్లు తెలిపారు.

కమాన్‌పూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా సురేశ్

కమాన్‌పూర్, జూలై 31: కమాన్‌పూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా మండల పర్యవేక్షణ అధికారి సురేశ్‌ను నియమిస్తూ జడ్పీ సీఈవో నరేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్‌కు తోటి ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్స్ పంపిణీ

పెద్దపల్లి రూరల్, జూలై31: రాఘవాపూర్ జీపీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు డీఎల్పీవో వేణుగోపాల్ బుధవారం రెయిన్ కోట్స్ అందజేశారు.కార్యక్రమంలో ఎంపీవో ఎండీ ఫయాజ్, కార్యదర్శి తూముల రవి, కార్మికులు పాల్గొన్నారు.

తీరిన వరద నీటి కష్టం

జూలపల్లి, జూలై 31 : చీమలపేటలో వరద నీటి కష్టం తీరింది. ఎట్టకేలకు ఎంపీవో అనిల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాదాపు 10 రోజుల నుంచి తారురోడ్డుపై నిలిచిన వరదతో గ్రామస్తుల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఈ క్రమంలో బుధవారం మోటర్లు అమర్చి వరద నీటిని తోడించారు. వానాకాలంలో వరద రోడ్డుపై చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్, జూలై31: మండలంలోని కేజీబీవీ, మల్యాల మోడల్ స్కూల్ లో తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ కుక్ గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్‌నకు గాను ఎస్సీ మహిళ కేటగిరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మల్యాల మోడల్ స్కూల్ లో అసిస్టెంట్ కుక్‌నకు గాను ఓసీ మహిళా కేటగిరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కేజీబీవీలో డే వాచ్‌మెన్ మహిళా పోస్ట్ కు గాను ఓసీ మహిళా కేటగిరి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: మున్సిపల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని/మంథని రూరల్, జూలై 31: ధరణి పెండింగ్ సమస్యలను అధికారులు వెంటనే పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంథని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సుడిగాలి పర్యటన చేశారు. వెంకటాపూర్, అడవి సోమనపల్లి గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల వద్ద ట్రెంచ్‌లను పరిశీలించారు. ఎక్కడ కూడా ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంథనిలోని తహసీల్, మున్సిపల్, డిప్యూటీ ఇంజినీర్, పీఆర్‌శాఖ, ఐబీ అతిథి గృహాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్ కార్యాలయానికి మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ కార్యాలయం ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐబీ అతిథి గృహంలో మరమ్మతు పనులను పరిశీలించిన కలెక్టర్ నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంథని మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గంతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై చర్చించారు. కొత్త పురపాలక కార్యాలయం, వెజ్, నాన్ వెజ్ మార్కెట్, డంప్ యార్డ్ నిర్మాణానికి సంబంధించి అనుమతులు డీటీసీపీ నుంచి త్వరిత గతిన సాధించాలని సూచించారు. ఖాన్‌సాయిపేట, ఆరెంద, అడవిసోమనపల్లి, వెంకటాపూర్‌లోని పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల మైదానాల్లో వర్షపు నీరు నిల్వకుండా గ్రౌండ్ లెవెలింగ్ చేయాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో హనుమానాయక్, డీఏవో తూము రవీందర్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ చైర్పర్సన్ పెండ్రి రమా సురేశ్ రెడ్డి, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ ఇంజనీర్ నవీన్, మున్సిపల్ కమీషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి, ఏఈ అనుదీప్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది వినతి

ఆర్డీవో కార్యాలయంలో కనీస వసతులైన వాష్ రూంలు ఏర్పాటు చేయాలని కార్యాలయసిబ్బంది కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కార్యాలయం వచ్చే అర్జీదారులు, తహసీల్ కార్యాలయ సిబ్బంది ఆర్డీవో కార్యాలయంలో ఉన్న వాష్ రూంలనే వినియోగించుకోవాల్సి వస్తున్నదన్నారు. ఏడాది నుంచి వాష్ రూంలను శుభ్రం చేయక పోవడంతో ఇబ్బందులు గురవుతున్నామన్నారు. సమస్యను పరిష్కరించాలని సిబ్బంది కోరారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మొక్క నాటుతున్న రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 31: నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రామగుండం కమిషనరేట్‌లో బుధవారం మొక్క నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన సీపీ

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్ఐలు ఎం రాజేంద్రప్రసాద్, దత్తుప్రసాద్ శర్మ, అబ్దుల్ సత్తార్‌లను రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ సన్మానించారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విడ్కోల సన్మానంలో సీపీ రిటైర్డ్ ఎస్ఐలను సన్మానించి మాట్లాడారు. ఇక్కడ అదనపు డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవి కుమార్, మల్లారెడ్డి, వెంకటస్వామి, నరసింహాలు, ప్రతాప్, సురేంద్ర, ఏఓ అశోక్‌కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, మధు, వామనమూర్తి, సూపరింటెండెంట్‌లు ఇంద్రసేనా రెడ్డి, సంధ్య, మనోజ్‌కుమార్, సీసీ పవన్‌రాజ్, గౌస్, కమిషనరేట్ పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, స్వామి ఉన్నారు.

అరెస్టును ఖండించిన జేఏసీ

గోదావరిఖని, జూలై 31: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా పోలీసులు మంగళవారం అర్ధరాత్రి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆటో జేఏసీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ ఖండించారు. ఆటో డ్రైవర్ల జీవన మనుగడ కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఆత్మహత్యలు చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ. 25లక్షల పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ యూనియన్ రాష్ట్ర అధికారి ప్రతినిధి దార మధు, ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్, కార్యదర్శి వేల్పుల నరేశ్, జిల్లా ఇన్‌చార్జి కాసిపేట రాజయ్య, అంబాల శంకర్, డ్రైవర్లు ఉన్నారు.

బాధితులను పరామర్శించిన జీఎం

గోదావరిఖని, జూలై 31: సింగరేణి ఆర్జీ-1 ఏరియా జీడీకే 2 గనిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న సంపత్‌కుమార్, శంకర్, నోయల్‌ను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని జీఎం వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు.

చేతగాకే అడ్డదిడ్డం మాటలు

- కోర్టు తీర్పు తర్వాత విప్ అడ్లూరి వ్యాఖ్యలు అభ్యంతరకరం
- దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు ఏం చేసింది
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, జూలై 31, (నమస్తే తెలంగాణ) : అభివృద్ధి చేతగాక ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అసెంబ్లీలో అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా విమర్శించారు. దళితబంధు స్కీం గైడ్‌లైన్స్ సరిగా లేవని, ధర్మపురి నియోజకవర్గంలో కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చాడని మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అందులో ఎంతమాత్రం నిజంలేదని కొట్టిపారేశారు. బుధవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 2018లో తన కడుపు కొట్టి, కలెక్టర్ సహకారంతో గెలిచాడంటూ తనపై అడ్లూరి చేసిన వ్యాఖ్యలపై కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఆక్షేపించారు. దేశంలో ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాన్ని ఏ న్యాయస్థానం తప్పుపట్టలేదనే విషయాన్ని గుర్తెరిగి మాట్లాడాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏనాడు తాను కౌంటింగ్ హాల్‌లోకి పోలేదన్నారు. లక్ష్మణ్‌కుమార్ 2018లో కౌంటింగ్ హాల్‌లోనే ఉండి, ప్రతి ఓటును పరిశీలించుకున్న తదుపరే ఓటమిని అంగీకరించారన్నారు. ఎన్నికల ఫలితాలపై కోర్టులో కేసు వేసి, ప్రజల్లో సానుభూతి పొందాలన్న తప్పుడు రాజకీయం చేసిన వ్యక్తి లక్ష్మణ్‌కుమార్ అంటూ దుయ్యబట్టారు. హైకోర్టు 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవకతవకలు లేవని తీర్పునిచ్చిందన్నారు. 'మా హాయాంలో 39వేల మందికి దళితబంధు ఇచ్చినం.. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత మందికి ఇచ్చిందని మాజీ మంత్రి ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలో రెండో దఫాలో ఎంపిక చేసిన 1200ల మంది దళితబంధు నిధులు ఇప్పించే తెలివిలేని ప్రజాప్రతినిధి అసెంబ్లీ వేదికగా అడ్డదిడ్డంగా మాట్లడడం సరికాదన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు రూ. 12లక్షలు ఇస్తామంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

సింగరేణి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ

గోదావరిఖని, జూలై 31: సింగరేణి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ కట్టుబడి ఉందని యూనియన్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. బుధవారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై1 హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో బీఎంఎస్ మినహా అన్ని యూనియన్లు కలిసి సింగరేణి సంస్థ రక్షణ కోసం, బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా పోరాడుతామని అన్నారని, కాని జూలై 5న జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ పాల్గొనగా, కొన్ని యూనియన్‌లు పాల్గొనప్పటికి మరికొన్ని యూనియన్‌లు పాల్గొనలేదన్నారు. 1945కు ముందు సింగరేణి కాలరీస్ ప్రవేటులో ఉంటే ఏఐటీయూసీ పోరాటం చేసి ప్రభుత్వ రంగ సంస్థగా మార్పు చేయించినట్లు తెలిపారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికలు జరిగిన ఏడు నెలలు గడిచిన గుర్తింపు పత్రం ఇప్పటి వరకు యాజమాన్యం, ప్రభుత్వం ఇవ్వకున్న కార్మికుల సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి ఉపాధ్యాక్షుడు మాదన మహేశ్, సహాయకార్యదర్శి రంగు శ్రీనివాస్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, నాయకులు వెంకటేరెడ్డి, దొంత సాయన్న, నాగేందర్, గుర్రం ప్రభుదాస్, బలుసు రవి, బండి మల్లేశ్, వేముల అశోక్, ఆకునూరి శంకరయ్య, పులి రవి, రమేశ్‌గౌడ్, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

ఆర్జీ-2లో సేవా సమితి కోర్సుల శిక్షకులకు ఇంటర్వ్యూలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 31: 2024-25 సంవత్సరానికిగాను సింగరేణి సేవా సమితి ఆర్జీ-2లో కుట్టుమిషన్, ఫ్యాషన్ డిజైనిగ్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణనిచ్చే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఓటుజీఎం వెంకటేశ్వర్ రావు హాజరై ఇంటర్వ్యూలను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూలో శిక్షకుల విద్యార్హతలు, అనుభవం, తదితర సర్టిఫికెట్స్ పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో 23మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. త్వరలోనే వివిధ కోర్సుల వారీగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఐఈడీ) మురళీకృష్ణ, డీజీఎం (ఫై) వెంకటరాంచంద్ర, డీజీఎం(ప) జీ. రాజేంద్రప్రసాద్, డీవైపీఎం ఎన్. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇసుక రవాణా

పెద్దపల్లి, జూలై31: జిల్లాలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇసుక రవాణా జరిగేలా అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇసుక రవాణాపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, డీసీపీ ఎం చేతనతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ ఏడాది మే 31న ఎన్‌జీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలోని 18 ఇసుక రీచ్‌లను మూసి వేశామని తెలిపారు. ఖమ్మంపల్లి ఇసుక రీచ్ వారంలోగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూపట్టుబడిన ట్రాక్టర్లకు విధించే జరిమానా రూ. 5 వేల నుంచి రూ. 25 వేలకు , లారీలకు విధించే జరిమానా రూ. 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతూ జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకు సంబంధించి కలెక్టర్ అధికారులతో చర్చించారు. తహశీల్దార్, పోలీస్ అధికారులు సంయుక్తంగా కేసులను పరిశీలించి చట్ట ప్రకారం తల్లిదండ్రులకు మెయింటెనెన్స్ ఇప్పించాలని ఆదేశించారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

గడువులోగా ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులపై జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులకు అనుగుణంగా మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేసుకొని ప్రణాళిక ప్రకారం దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను ప్రొహిబిటెడ్ జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు.

సీఎంఆర్ డెలివరీ చేయాలి

సకాలంలో సీఎంఆర్ డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, రైస్ మిల్లర్లకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. 66 మంది రైస్ మిల్లర్లకు కేవలం 32 మంది మాత్రమే హాజరయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే సకాలంలో రైస్ డెలివరీ చేయని రైస్ మిల్లర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ ప్రేమ్ కుమార్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములను కాపాడాలని వినితి.

పెద్దపల్లి రెవెన్యూ శివారులోని దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కరీంనగర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు బుధవారం వినతి పత్రం అందించినట్లు రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్షక్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేశ్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం రైల్వే స్టేషన్ రోడ్‌లోని గోశాల, పెద్దపల్లిలోని శ్రీవేంకటేశ్వ స్వామి దేవాలయం, శ్రీ సీతారామస్వామి దేవాలయాలకు సంబంధించిన దాదాపు 18 ఎకరాలు అన్యాక్రాంతమైందని తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేసి సర్వే చేయించి హద్దులు నిర్ణయించి దేవాలయాల భూములు కాపాడాలని వినతిలో పేర్కొన్నట్లు రాజేశ్ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ముత్తారం , జూలై 31: మండలంలో పెండింగ్ ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముత్తారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పెండింగ్ ధరణి అర్జీలు, భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ మొదలగు అంశాలపై సమావేశం సమీక్ష జరిపారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఇక్కడ తహసీల్దార్ సుమన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దపల్లి రూరల్, జూలై31: పెద్దపల్లి మండలంలో ఏడాది క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన దాసరి శివాజీ కుటుంబానికి అతని చిన్ననాటి స్నేహితులు చేయూతనందించారు. అప్పన్నపేటలో పదో తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.20 వేలు, బ్రాహ్మణపల్లికి చెందిన వారు రూ.25 వేలు పోగు చేసి మొత్తం రూ.45 వేలను శివాజీ కూతురు పేరిట ఫిక్స్‌డ్ చేశారు. అందుకు సంబంధించిన బాండ్‌ను శివాజీ కటుంబసభ్యులకు అందజేశారు.

నిరుపేద కుటుంబాలకు సాయం

కమాన్‌పూర్, జూలై 31: మండల కేంద్రంలోని బాపూజీ నగర్‌కు చెందిన కామెర లక్ష్మయ్యకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లో దాచుకున్న రూ.13వేల నగదు అగ్నికి ఆహుతి కాగా, సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనాల వెంకటస్వామి తన సొంత ఖర్చులతో హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ బ్యాంకుకు వెళ్లి నోట్లు మార్చివేయించారు. కమాన్‌పూర్ తహసీల్దార్ ఆరిఫొద్దీన్ చేతుల మీదుగా బుధవారం బాధితుడికి అందజేశారు. అలాగే ఫౌండేషన్ అధ్యయుడు బోనాల మల్లయ్య ఆదేశాల మేరకు అదనంగా రూ.7వేలు కలిపి మొత్తం రూ.20వేలు బోనాల వెంకటస్వామి అందజేశారు. సిద్ధిపల్లె జీపీ పరిధి శాలపల్లెకు చెందిన సజ్జనపు రాజనందం